చేయించుకోమంటే దేవుడ్ని అడగాలట, ఆయన అన్నీ దేవుడ్ని అడిగేచేస్తాడట. మీకు మరీమరీ నమస్కారాలని చెప్పమంది.

పూలబంతిలా చెంగుమని ఎగుర్తూ పాడుతూ గెంతే మీ సుశీలా రాణి యిప్పుడు కుంటిరిక్షాలా డొక్కు కారులా, పాత సీనారేకు డబ్బాలా వుంది. చూడొద్దు – మీరు చూస్తే కొంతమంది ఆడపిల్లల పాలిట తెలుగు మ్యారేజి ఎటువంటి శాపమో తెలుసుకొని బాధపడ్తారు. మీజేబులో బర్కిలీ సిగరెట్లు కొట్టేసి మంచం కింద కూర్చుని సిగరెట్లు కాల్చే సుశీలారాణి వొళ్లోపిల్లలు దొడ్డికెళ్ళి వుచ్చలు పోసేస్తుంటే ఎప్పుడు తనమొగుడు దేవుడు పర్మిషను తీసుకుంటాడా అని ఎదురుచూస్తూ వుంటుంది బిక్కు బిక్కు మంటూ. సుశీలారాణి ముఖంలో చిరునవ్వుల వెన్నెలలు సాక్షాత్కరించాలంటే దేవుడి పర్మిషన్ కావాలి; సిగరెట్లు కాల్చే ఆడభక్తుల్ని రౌరవాది నరకాల్లో తోస్తాడు కాని వరాలిస్తాడా? – దేవుడు – ఫిలాసఫీ లెక్చరరుపార్టీ. అందుకే బ్రేవో. సుశీలారాణి – నీవు వొంటరిగానే పయనించు.

నీకు తోడెవ్వరూ వుండరు
నీకు తోడెవ్వరూ రారు;
అకేలీ చలో :

# ఇతరులు లోనికి రాకూడదు

అసలు సున్ని పిండితో ఓ గుంటడ్ని తయారు చేసిందట ఆ మహాతల్లి. దేవతలన్న పేరే గాని వాళ్ళకు కామన్సెన్స్ వుండదల్లే వుంది. బాత్‌రూం కట్టించుకుంటే, కనీసం సింపుల్‌గా తలుపు వేసుగుంటే సున్నిపిండితో ఒక గుంటడ్ని చేసి గుమ్మందగ్గర కూర్చోబెట్టడం వుండదుకద: తలంటోసు గుంటోందయ్యా – ఆవిడ జగన్మాత: ఆ నలుగుపిండిని వేస్టు చేయడ మెందుకని ఆవిడకో అయిడియా వచ్చి వుంటుంది. జగన్మాతకు కూడా ఇలాంటి తలక్రిందులు ఆలోచన్లు ఎలా వస్తాయో నాకు బోధపడకుండా వుంది. ఇప్పటికి పల్లెటూళ్లలో ఆడవాళ్లు నూతిదగ్గర దొడ్లో చెట్టుక్రింద ఇటుకరాతిమీద కూర్చుని పులుసు పోయించుకుని తలంటోసుగుంటూ వుంటారు. జగన్మాత తలంటోసు గుంటూంటే పులుసెవరు పోశారో....

పులుసు పోసేందుకు మరోపిండితో మరో ట్రబుల్సం బోయిని కాని, సారీ గరల్నుకాని సృష్టించి వుండవచ్చు. ఒక వేళ ఆ వెర్రి తల్లి పిల్లవాడ్ని చేసిందికాని ఒక మాంచి యంగ్ గరల్నుచేసి గుమ్మం దగ్గర కాపలా పెట్టివుంటే శివుడు గుమ్మం దాటకుండానే మరేదొ అఘాయిత్యం చేసివుండును. బోయిని సృష్టించడంలో ఆ మహాతల్లి చిన్న లవుక్యం ప్లే చేసింది.

ఈ వెర్రి పీనుగు ఎలాగు ఫాదర్ను అటకాయిస్తాడు. ఆ కోపిష్టి మొగుడు వీడి అంతుచూస్తాడు. అప్పుడు ఈ వంకమీద తను శివుడుగారికి రైట్ ఎబవుటు టరన్ చెప్పవచ్చు అని వూహించి వుంటుంది.

అయినా "ఇతరులు లోనికి రాకూడదు". అని బోర్డు కట్టేస్తే సరిపోయేది. ఈ మాత్రానికి పిండిబొమ్మను చేసి గుమ్మందగ్గర కూర్చోబెట్టడం దేనికంట.

అయినా ఆ మగాడికి శివుడు గారికి అంత తొందరేల -

తలంటోసుంగుంటున్న ఆడదానితో తన కేమిపని?

అంత అనుమానమా మనిషికి కాదు. దేవుడికి

లోపలెవరన్నా వున్నారని అనుమానం వుంటే నరికేయవచ్చుకాని - గేటుదగ్గర కూర్చోపెట్టిన గుంటడ్ని అమాంతం పీక తెగవెయ్యటమే?

పెళ్ళాంమీద మనసుంటే వుండవచ్చు - అహ్హా - కాదనము అందుకని దారిలో అడ్డమైన వాళ్ళందర్ని నరికేసెయ్యటమే;

భార్యల విషయంలో సాక్షాత్తూ దేవతలే ఇంత అసందర్భంగా ప్రవర్తిస్తే ప్రతి సంవత్సరం ఈ స్టోరీ చెప్పుకునే మనుష్యులు ఇంకెంత అసందర్భంగా ప్రవర్తిస్తారో వూహించడం కష్టం; దట్సాల్ రైట్.

జరిగిందేదో జరిగి పోయింది.

ఆ కుర్రాడికి గజాసురుడి తలకాయ తెచ్చి అతికించడమేమి?

తన తలకాయలాంటి తలకాయ అంటించాలని తోచలేదా?

ఏనుగు తలకాయతెచ్చి అంటించాడు కాని అలాటి తలకాయ వున్నవాడికి ఎక్కడన్నా పెళ్ళవుతుందా; అబ్సర్డ్ -

అందుకే ఆ పూర్‌బోయ్‌కి పెళ్ళికాలేదు.

పెళ్ళాడేందుకు ఏ ఆడపిల్లా ముందుకురాలేదు.

అందుకని ఆ వినాయకుడికి ఆడిట్ ఆఫీసరు ఎకవుంటెంటులాటి ఉద్యోగం ఒకటి తగిల్చి దిక్కుమాలిన అబ్జక్షన్స్ అన్నిటికీ నువ్వు గణాధిపుడవు అని నేం బోర్డు లగాయించారు. నిన్ను పూజించకపోతే అపనిందల పాలవుతారు. నీ ఇస్టోరీవిని అక్షంతలు వేసుకోకపోతే చవితి చంద్రుడ్ని చూస్తే - జనం బ్లాక్ మైలవుతారు. అని నీతి తయారుచేశారు.

శ్రీకృష్ణుడిలాంటి టక్కరి రాజకీయవేత్త మిల్కులో మొహం చూడడంవలన సత్రాజిత్తుతో ట్రబుల్సులో పడాల్సి వచ్చింది. నవనీత - చోరుడు బ్లాక్ మెయిల్‌కి టెరిబిల్‌గా అప్ సెటయాడు.

అయితే జాంబవంతుడితో ఫయిట్ బాండ్ స్టోరీలా గొప్ప త్రిల్‌గా వుంటుంది. ఒక ఫయిట్ చేయడం ఒక గరల్ని పెళ్ళాడటం - శ్రీకృష్ణుడు అలా పదహారు వేలమంది గరల్సుని పెళ్ళాడేశాట్ట. ఈ ఫిగర్ని మీరు నమ్ముతారూ? పదహారు వేలమందిని పెళ్లాడినా రెస్పెక్టు కించిత్తు తరగలేదు మహానుభావుడికి. అయితే ఈ పెళ్లాలపేర్లన్నీ శ్రీకృష్ణుడికి ఎలా కంఠతా వచ్చు - ఎవరింటికి ఎప్పుడు వెళ్ళాలో యివన్నీ గణాంకశాఖ గణాధిపతి ఎకవుంట్సురాసి వుంచేవాడేమో;

వినాయకుడ్ని చూస్తే నిజంగా జాలేస్తుంది. ఏడాదికోమాటు బస్సులవాళ్లూ, స్టూడెంట్లు, అచ్చు తప్పుల్ని తప్పించడం కోసం పత్రికల వాళ్ళు, దుకాణదారులు, మనీ లెండర్సు తల్చుకుంటే తల్చుకోవచ్చుగాక ఓ పెళ్ళాం సంసారం పిల్లలూ లేకుండా ఎంతకాలం?

ఏమదరూ తన కొడుకు బ్రహ్మచారిగా వుండడం యిష్టపడదు గదా;

ఓ పన్నెవడో రాలగొట్టాడు - గజాననం - యివన్నీ డిస్క్వాలిఫికేషన్లే - పెళ్ళికి. ప్రతి హార్మనీవాయించేపిల్లా "లంబోదర లకుమికర" అంటూంటే వింటూ తన మేరేజి పోస్టు పోనవుతూంటె పాపం వినాయకుడు కుడుములు తింటూ ఎలుకనెక్కి అమాయకుళ్ళా సంచరిస్తూ వుంటాడు.

సైకిలెక్కే వాడికే లేదుకదా రెస్పెక్టు ఎలుకనెక్కేవాడికి ఎందుకుంటుందీ? కనీసం స్కూటరయినా - ఫర్వాలేదు ఓ మోస్తరు.

వినాయకుని పెళ్ళికి అత్తార్ని స్కూటరడగమని మనమంతా సపోర్టిద్దాం.

# గేదె మనసులు

గేదెలు డామ్ కేర్ మాష్టర్లు. గేదె శుభ్రంగా నీటుగా అలంకరించుగున్న సినిమా స్టారులా ఆకర్షణీయంగా ఎలా వుంటుంది? ఆరీస్నానిలా వుండమన్నా వుండదు. గేదెల ఫిలాసఫీ అంతా బురద ఫిలాసఫీ. అవి బురదలో పడుకున్నపుడు ఒక్కొక్కటి అరడజను బాక్సాఫీసు హిట్లు తీసిన సినిమా ప్రొడ్యూసర్లలా నిర్లక్ష్యంగా చూస్తాయి మనకేసి, బురదకేసి ఆకర్షింపబడి మనలను బురదలోకి లాగాలన్నట్లుగా చూస్తాయి. గేదెలు కవిత్వం రాస్తే బురదను మెచ్చుకుంటూ రాసిన వాడికి సహస్రఘట బురదాభిషేకం చేస్తాయి.

గేదెలకు భావాలుండవని ఎవరంటారు? ఆలోచనలు కలగవా? కలిగితే కలగవచ్చు. బురదలో పడుకున్న గేదె హృదయం రకరకాల భావాలకు రహదారి. గేదెలుకూడా స్త్రీజాతే కనుక - నాటి స్త్రీ జాతిని మానవులలో చూడటం వలన కలిగే రకరకాల భావాలతో అవి మునిగి తేలవచ్చు. (గేదెలు బురదలో మునిగినట్లు....) అవి మనస్త్రీల కట్టు-బొట్టు వ్యవహారికాల్ని గూర్చి ఏమనుకుంటాయో వూహిస్తే నాకు పరమ ఆశ్చర్యంగా ఉంటుంది. ఆసుపత్రులకు వెళ్ళడం లేదు. డాక్టర్లు లేకుండా? నర్సులు లేకుండా కన్నతల్లి చేసేపని చేస్తాయి కొన్ని గేదెలు. గేదెకూడా కంటుంది, తింటుంది, పాలిస్తుంది.

స్వచ్ఛమైన కమ్మటి తీయని పాలు - అలాటి పాలుతాగి ఎలాటి మంచిపనులైనా చేయవచ్చు మనం, కాని అడ్డమైన ఛండాలపు పనులు చేయడం మానలేకుండావున్నాం మనలో మనం.